జ్వాల

# దశ

నిజం.. నిర్భయంగా..

WWW. DASHANEWS .COM

బుధవారం 11 02 2026

సంపుటి 1 సంచిక 81

పేజీలు : 04

PRGI No : TGTEL/25/A4195





దశ పత్రికలో పనిచేసేందుకు జీహెచ్ఎంసీ పరిధిలో రిపోర్టర్లు కావలెను. సీనియర్ రిపోర్టర్లకు తగిన పారితోషికం ఇవ్వబడును.

7337 54 6647
9848 28 8850


## బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య



**దశ, నారాయణపేట:** కాంగ్రెస్ నాయకుల వేధింపులు భరించలేక బీజేపీ మున్సిపల్ ఎన్నికల అభ్యర్థి ఆత్మహత్య చేసుకున్నాడు. నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలోని 6వ వార్డు బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఎరుకలి మహదేవప్ప ఆత్మహత్య చేసుకున్నాడు. నిన్ను జైలులో వేపిస్తాం అంటూ కాంగ్రెస్ నాయకుల బెదిరింపు, ఫోన్లో మెసేజీలు పెట్టి భయపెడుతున్నారు అంటూ కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేసారు. సోమవారం అర్ధరాత్రి మహదేవప్ప ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

## మక్తల్‌లో ఎన్నిక రద్దు

**దశ, మహబూబ్‌నగర్:** మక్తల్ మున్సిపాలిటీ 6వ వార్డు బీజేపీ అభ్యర్థి మహదేవప్ప మృతి రాజకీయంగా దుమారం రేపుతోంది. సోమవారం రాత్రి మహదేవప్ప ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. బీజేపీ అభ్యర్థి ఆత్మహత్యతో మక్తల్ 6వ వార్డు ఎన్నిక రద్దు చేశారు. మహదేవప్ప మృతిపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఫిబ్రవరి 11న ఎన్నికలు జరగనున్నాయి.మక్తల్ బీజేపీ అభ్యర్థి మహదేవప్ప

..మిగతా 4వ పేజీలో →

# 'మహారాణి

## నేడే మున్సిపల్ పోలింగ్.. ఫలితాలను శాసించనున్న మహిళలు

### 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్.

### ఓటు హక్కు వినియోగించుకోనున్న 52 లక్షల ఓటర్లు



**దశ, హైదరాబాద్:** తెలంగాణలో దాదాపు 2 నెలలుగా సాగుతున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి నేటితో తెరపడింది. ప్రచార గడువు ముగియడంతో.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఎన్నికల మైకులు బంద్ అయ్యాయి. ఈనెల 11వ తేదీన రాష్ట్రంలోని 7 కార్పొరేషన్లలో 414 వార్డు డివిజన్లకు.. 116 మున్సిపాలిటీల్లోని 2582 వార్డులకు పోలింగ్ నిర్వహించనున్నారు. మొత్తం పార్టీలు, ఇండిపెండెంట్లు కలిపి.. 12,930 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇక ఈ ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం.. 8,203 పోలింగ్ కేంద్రాలను రెడీ చేసింది. మొత్తం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కలిపి 52 లక్షలకు పైగా ఓటర్లు ఓటు వేయనున్నారు. ఈనెల 13వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టగా.. ఈనెల 14వ తేదీన మేయర్, ఛైర్‌పర్సన్ల ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇక ఈనెల 16వ తేదీన ప్రమాణ స్వీకార కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు.7 నగరపాలికలు, 116 పురపాలికలు కలిపి మొత్తం 123 మున్సిపల్, కార్పొరేషన్ల పరిధిలో 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు జరగనున్నాయి. ఇక ఈ ఎన్నికల్లో మొత్తం 52,43,023 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించేందుకు సిద్ధం అయ్యారు. వీరిలో 25,62,639 మంది పురుష ఓటర్లు కాగా.. మహిళా ఓటర్లు 26,80,014 మంది ఉన్నారు. సాధారణంగా ఏ ఎన్నికల్లో అయినా మహిళల కంటే పురుషుల

..మిగతా 4వ పేజీలో →

## మేడ్చల్ జిల్లాలో భూకంపం

**దశ, మేడ్చల్ :** మేడ్చల్ జిల్లాలోని కుత్బుల్లాపూర్, గాజులరామారం సహా పలు ప్రాంతాల్లో భూమి కంపించింది. కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని గాజులరామారం, ఆదర్శనగర్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం భూమి కంపించింది. కొన్ని సెకన్ల పాటు భూమి ఒక్కసారిగా షేక్ అవ్వడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఏం జరుగుతుందో అర్థం కాక, ప్రజలు తమ ఇళ్ల నుంచి వీధుల్లోకి పరుగులు తీశారు. ముఖ్యంగా పాఠశాలల్లో ఉన్న చిన్నపిల్లలు తీవ్ర భయాందోళనల మధ్య తరగతి గదుల నుంచి బయటకు వచ్చారు. ఆ పరిధిలోని స్కూళ్లకు సెలవు ఇచ్చి, విద్యార్థులను ఇళ్లకు పంపించివేశారు.ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. విద్యార్థులు భయంతో పాఠశాల మైదానంలోకి రావడం, స్థానికులు గుంపులుగా చేరి చర్చించుకోవడం ఆ వీడియోల్లో కనిపిస్తోంది. అయితే, ఇది నిజంగా భూకంపమా లేక స్థానికంగా ఉన్న మరేదైనా ఇతర కారణాల వల్ల ఈ కంపనాలు వచ్చాయా అన్నది ఇంకా స్పష్టం కాలేదు. దీనిపై భూభౌతిక శాస్త్రవేత్తలు (NGRI నిపుణులు), అధికారులు స్పందించాల్సి ఉంది.





## కీసర శివరాత్రి బ్రహ్మోత్సవాలు

### సీఎం రేవంత్ కు ఆహ్వానం అందించిన అధికారులు, అర్చకులు.

**దశ, హైదరాబాద్:** కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న "కీసరగుట్ట మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు-2026" కు హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఆలయ అధికారులు, ఆర్చకులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఆలయ ఈవో సుధాకర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి ని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముఖ్యమంత్రి గారికి ఆశీర్వచనలు అందించారు.

## 19 నెలల బాలికపై కుక్కలు దాడి...

### బాలికకు తీవ్ర గాయాలు.

#### కుక్కల బారి నుండి కాపాడాలి అంటూ స్థానికుల డిమాండ్.

**దశ, మేడ్చల్ మల్కాజిగిరి:** 19 నెలల బాలికపై కుక్కలు దాడి చేసి గాయపరచిన ఘటన కండ్లకోయ లో చోటు చేసుకుంది. కుక్కల దాడిలో బాలిక తీవ్రంగా గాయపడి ఆస్పత్రిపాలైంది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కండ్లకోయ గ్రామంలోని వేణు సుప్రజ కూతురు దాక్షిని అనే 19 నెలల బాలిక ఆదివారం రాత్రి ఆరు బయట ఆడుకుంటుండగా కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. చుట్టుపక్కల వాళ్ళు చూసి కుక్కను తరిమి వేసి బాలికను కాపాడారు. ఈ ఘటనలో బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. పాపను వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

#### వరుస సంఘటనలు జరిగిన పట్టించుకోరా...

గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలో కుక్కల దాడుల సంఘటనలు వరుసగా జరుగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో సైతం ఇంటిముందు ఆడుకుంటున్న బాబు పై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. సైకిల్ పై వెళుతున్న ఓ వృద్ధుడిపై కుక్కలు వెంటాడి మరి వృద్ధుడిని గాయపరిచాయి. ఇలాంటి ఘటనలో వెలుగులోకి రానివి ఎన్నో ఉన్నాయి. ఇప్పుడు తాజాగా కండ్లకోయాలో 19 నెలల బాలిక ఆడుకుంటుండగా కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది.

#### కుక్కలు బాబోయ్ కుక్కలు...

మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలో వీధికి పది కుక్కలు ఉన్నాయి. రోడ్డుపై బైఠాయించి వచ్చిపోయే ప్రయాణికులపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ప్రజలు రోడ్డు పైకి రావాలంటే జంకుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలను బయటకు పంపాలంటే స్థానికులు భయపడుతున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఉదయం వేళలో వాకింగ్ చేసే వారి విషయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వాకింగ్ చేయాలంటే ప్రజలు భయపడుతున్నారు. రోడ్డుపై బైఠాయించి వాకింగ్ వచ్చే వారిపైకి వెలుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఈ విషయంలో అధికారులు వెంటనే స్పందించి కుక్కల నుండి కాపాడాలి అంటూ స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.



## బీఆర్ఎస్ కార్యకర్తలను కారుతో ఢీకొట్టిన ఎమ్మెల్యే రోహిత్

**దశ, మెదక్:** డబ్బులు పంచుతుండగా అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలను కాంగ్రెస్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కారుతో ఢీకొట్టిన ఘటన ఇది. మెదక్ మున్సిపాలిటీలో 15,30 వార్డుల్లో మంగళవారం తెల్లవారుజామున డబ్బులు పంచేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, అతని అనుచరులు వచ్చారు. డబ్బులు పంచుతున్న మైనంపల్లి రోహిత్ ను బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. నిలదీసిన బీఆర్ఎస్ కార్యకర్తలను ఎమ్మెల్యే కారుతో ఢీకొట్టడంతో పలువురికి గాయాలు అయ్యాయి. గాయాలపాలైన బీఆర్ఎస్ కార్యకర్తలను ఆసుపత్రికి తరలించారు.







## ఏసీబీ వలలో మాదాపూర్ ఎస్సై

**దశ, హైదరాబాద్:** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మాదాపూర్ పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా పనిచేస్తున్న వినయ్ మంగళవారం ఏసీబీకి పట్టుబడ్డాడు. ఒక కేసులో అనుకూలంగా ఉండటం కోసం లక్షలు డిమాండ్ చేశాడు ఎస్సై వినయ్. దీంతో బాధితులు ఏసీబీని ఆశ్రయించి పక్కా ప్లాన్ తో ఏసీబీకి పట్టించారు. బాధితులనుండి యాభైవేల తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

## స్కూల్ బస్సును ఢీకొట్టిన ట్రాక్టర్..

### ఇద్దరు మృతి, 12 మందికి తీవ్రగాయాలు.

**దశ, వరంగల్:** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం శ్రీనగర్ క్రాస్ రోడ్డు వద్ద ఘోర ప్రమాదం తీగరాజుపల్లికి చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ బస్సును ట్రాక్టర్ డీకొట్టింది. ఘటన ప్రమాద సమయంలో బస్సులో 40 మంది పిల్లలు ఉండగా, ట్రాక్టర్లో 12 మంది ఉన్నట్లు సమాచారం. ట్రాకర్ లో వున్నవారంతా అన్నారం షరీఫ్ దర్గాలో కందూరు చేసుకొని వస్తున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ మద్యంమత్తులో అతివేగంగా నడపడమే ప్రమాదానికి కారణం. స్కూలు బస్సును ఢీకొని ట్రాక్టర్ బోల్తా పడడంతో దానిలో ప్రయాణిస్తున్న ఒక చిన్నారితో పాటు డ్రైవర్ మృతి చెందారు స్కూల్ బస్సులో ప్రయాణిస్తున్న పిల్లలకు స్వల్ప గాయాలు అయ్యాయి.



# 'మహారాణి

**మొదటి పేజీ తరువాయి**

ఓటర్ల సంఖ్య అధికంగా ఉంటుంది. కానీ ఈ ఎన్నికల్లో మాత్రం పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉండటం విశేషం. పురుషులు, మహిళలు మాత్రమే కాకుండా మరో 640 మంది ట్రాన్స్‌జెండర్లు కూడా ఈ ఎన్నికల్లో తమ ఓటును వేయనున్నారు.మరోవైపు.. ఈ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8,195 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఈ మున్సిపల్ ఎన్నికల కోసం ఏకంగా 16,031 బ్యాలెట్ బాక్స్‌లను రెడీ చేశారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పర్యవేక్షణకు 1,379 మంది రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించారు. వీరితోపాటు 1,547 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లను ఏర్పాటు చేశారు.క్షేత్రస్థాయి పర్యవేక్షణ కోసం 9,560 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు.. 31,428 మంది ఇతర సిబ్బంది మున్సిపల్ ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. పోలింగ్ పూర్తి అయిన తర్వాత.. బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరచడానికి 137 స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు కోసం 136 కౌంటింగ్ కేంద్రాలను కూడా సిద్ధం చేశారు. మరోవైపు.. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ వేళ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేసింది.సుమారు 25 వేల మంది పోలీసులతో రాష్ట్రవ్యాప్తంగా నిఘాను ఏర్పాటు చేశారు. మరీ ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాల వద్ద అదనపు బలగాలను మోహరించనున్నారు. పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు ప్రతీ పోలింగ్ స్టేషన్ వద్ద వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. దీంతో ఎన్నికల సంఘం అధికారులు స్వయంగా పోలింగ్ జరుగుతున్న తీరును పర్యవేక్షించవచ్చు. ఈ ఎన్నికల్లో మొత్తం 12,993 మంది అభ్యర్థులు.. కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్ ముగిసిన తర్వాత.. ఓట్ల లెక్కింపును ఫిబ్రవరి 13వ తేదీన చేపట్టి.. అదే రోజు ఫలితాలను ప్రకటించనున్నారు. ఆ తర్వాత ఫిబ్రవరి 14వ తేదీన కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్లతో పాటు.. మున్సిపాలిటీల్లో ఛైర్‌పర్సన్, డిప్యూటీ ఛైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియను చేపట్టనున్నారు.

ఆ తర్వాత ఫిబ్రవరి 16వ తేదీన కొత్తగా ఎన్నికైన వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారంతోపాటు.. ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. దీంతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది.మరోవైపు.. ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర నేతలతోపాటు.. జాతీయ నేతలు కూడా కాంగ్రెస్, బీజేపీ పార్టీ అభ్యర్థుల తరపున మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పర్యటనలు, రోడ్ షోలు, ఇంటింటి ప్రచారంతో గత కొన్ని రోజులుగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో సందడి వాతావరణం నెలకొంది. ఇప్పుడు ప్రచారం ముగియడంతో అంతా నిశ్శబ్దంగా ఉంది. ఈనెల 11వ తేదీన జరగనున్న పోలింగ్‌లో ఓటర్లు ఎవరికి ఓటు వేసి.. పట్టం కడతారనేది తెలియాలంటే ఈనెల 13వ తేదీ వరకు వేచిచూడాల్సిందే.

# మక్తల్‌లో ఎన్నిక రద్దు

**మొదటి పేజీ తరువాయి**

మరణం ఆత్మహత్య కాదని, అది కాంగ్రెస్ పార్టీ చేసిన రాజకీయ హత్య అని బండి సంజయ్ ఆరోపించారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ నాయకులు బెదిరింపులకు, అరాచకాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ అరాచకాలను ఎదురొడ్డి పోరాడిన చరిత్ర బీజేపీ కార్యకర్తలదని, తమ సహనాన్ని పిరికితనంగా భావించవద్దని హెచ్చరించారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీని ప్రజలు రాళ్లతో కొట్టే పరిస్థితి వస్తుందని, ఈ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసే రోజులు దగ్గరపడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.మక్తల్ బీజేపీ అభ్యర్తి మహదేవప్ప మృతి ఘటనపై నిష్పాక్షిక విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. బీజేపీ అభ్యర్థి చావుకు కారకులైన కాంగ్రెస్ నేతలను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తామని బండి సంజయ్ స్పష్టం చేశారు. బీజేపీ నాయకత్వం ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. బీజేపీ నేత మహదేవప్ప కుటుంబాన్ని పరామర్శించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఇప్పటికే బయలుదేరి వెళ్లారు.మక్తల్ బీజేపీ అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్యపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మహదేవప్ప బలవన్మరణం కేవలం ఆత్మహత్య కాదని, కాంగ్రెస్ పార్టీ అహంకారపూరిత రాజకీయాలు, మాఫియా బెదిరింపుల వల్ల జరిగిన దారుణమని ఆయన ఆరోపించారు. స్థానిక మంత్రి వాకిటి శ్రీహరి, ఆయన అనుచరుల వేధింపులు భరించలేకే మహదేవప్ప ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపణలు వస్తున్నాయని, అధికార మత్తులో కాంగ్రెస్ నేతలు ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారని ఆయన మండిపడ్డారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కమిషనర్ శరత్ చంద్ర

**దశ, నల్గొండ :** 2వ సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా, ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు నల్గొండ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ పోలింగ్ కేంద్రాలను మంగళవారం అదనపు ఎన్నికల అధికారి, నల్గొండ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి. శరత్ చంద్ర పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా పోలింగ్ సిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఓటర్లు భద్రంగా మరియు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు.


## గజ్వేల్ మున్సిపల్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి..

దశ,గజ్వేల్: సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ కేంద్రాలకు అవసరమైన బ్యాలెట్ యూనిట్లు, ఈవీఎంలు, వీవీప్యాట్లు తదితర ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేస్తూ, ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# గజ్వేల్‌లో ప్రైవేట్ ఆసుపత్రిలో మూడు నెలల పసికందు మృతి...

**దశ,గజ్వేల్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పరిధిలోని ABC ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మూడు నెలల పసికందు మృతి చెందింది. వర్గల్ మండలం చౌదరిపల్లికి చెందిన భాస్కర్-పుష్పలత దంపతుల కుమారుడికి జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తడంతో గజ్వేల్‌లోని ABC ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. చికిత్సలో భాగంగా వైద్యులు చిన్నారి ముక్కు, గొంతులో పైపులు అమర్చి చికిత్స ప్రారంభించారు. అయితే చికిత్స పొందుతున్న సమయంలోనే పసికందు మృతి చెందింది. ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ బిడ్డ మృతి చెందిందని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. సరైన వైద్యం అందించకపోవడమే ఈ దుర్ఘటనకు కారణమని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కుటుంబీకులు డిమాండ్ చేశారు.

# కోడ్ ముగియగానే 'పదవుల జాతర'



**దశ, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల కోడ్ ముగియగానే కీలక పదవులను భర్తీతో పాటు క్యాబినెట్ విస్తరణ చేయనున్నారా? అంటే అవుననే టాక్ వినిపిస్తోంది. ఎన్నికలకు ముందు ఆ తర్వాత నేతలకు ఇచ్చిన హామీ ప్రకారం మంత్రి పదవులతో పాటు కార్పొరేషన్ పదవులు కట్టబెట్టాలని భావిస్తున్నారట. అయితే కొందరు తమకు పదవులు ఇవ్వకపోతే ఊరుకునేది లేదని అల్టిమేటం జారీ చేస్తున్నారట.ఇంకొందరు అయితే తమకు పదవులు ఇవ్వకపోయినా సరే, కానీ వేరే పార్టీ నుంచి వచ్చిన వలస నేతలకు పోస్టులు ఇవ్వొద్దని అగ్రనేతలకు తేల్చి చెబుతున్నారట. ఈ క్రమంలోనే మున్సిపల్ ఎన్నికల కోడ్ ముగియగానే కాంగ్రెస్ పార్టీలో పదవుల జాతర స్టార్ట్ కానుందట.క్యాబినెట్‌లో మిగిలిన రెండు మంత్రి పదవులతో పాటు పలు కీలకమైన కార్పొరేషన్ పదవులను భర్తీ చేసేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తోందట. మరోవైపు కులసంఘాల కార్పొరేషన్ ఛైర్మన్ల భర్తీపై కూడా ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అయితే మున్సిపల్ ఎన్నికల కోడ్ రావడంతో పదవుల భర్తీకి బ్రేకులు పడ్డట్లు చెప్పుకుంటున్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే కీలక పదవులు భర్తీ చేస్తామని చెబుతున్నారట ప్రభుత్వ పెద్దలు. క్యాబినెట్ బెర్తుల కోసం హస్తం పార్టీలో హెవీ కాంపిటేషన్ ఉంది. సామాజిక వర్గాల వారీగా అమాత్య యోగం కోసం పోటీ పడుతున్నారు నేతలు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం పదవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. ఇక రంగారెడ్డి జిల్లా నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి గట్టి పట్టుబడుతున్నారు. ఢిల్లీకి వెళ్లి పార్టీ అధిష్ఠానానికి విన్నవించుకున్నారు. ఇంతలో సీఎం రేవంత్ రెడ్డి పరిగి సభలో చేసిన కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. మాజీ ఎంపీ రంజిత్ రెడ్డిని మున్సిపల్ శాఖ మంత్రిని చేస్తానంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు కొత్త చర్చకు దారితీశాయి. సీఎం రేవంత్ ఫ్లోలో అలా మాట్లాడారా లేక రంజిత్‌రెడ్డిని మంత్రి చేయబోతున్నారా అనేది డిస్కషన్ పాయింట్‌గా మారింది.ఈ క్రమంలోనే వలస వచ్చిన నేతలకు కాకుండా..పార్టీలో ముందు నుంచి ఉన్నవారికి గతంలో హామీ ఇచ్చినవారికి అమాత్య పదవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు నేతలు. ఇక బీసీ వర్గం నుంచి కూడా పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ పేరు ప్రధానంగా చర్చకు వస్తున్నా..విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ వంటి వారు పోటీ పడుతున్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే ప్రభుత్వం భర్తీ చేయాల్సిన కీలక పదవుల్లో మహిళా కమిషన్ ఒకటి. మహిళా కమిషన్ ఛైర్మన్‌తో పాటు సభ్యులుగా..కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కీలకంగా వ్యవహరించిన మహిళలకే అవకాశం ఇవ్వాలని హస్తం పార్టీ మహిళా నేతలు కోరుతున్నారు. అయితే ఈ పదవిని ప్రస్తుత జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మికి ఇవ్వబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది గ్రేటర్ మేయర్ విజయలక్ష్మీ పదవీకాలం ముగుస్తుంది. ఆ త్వరాత ఎన్నికల కోడ్ ముగియగానే విజయలక్ష్మికి మహిళా కమిషన్ ఛైర్మన్ పదవి కట్టబెట్టబోతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై మహిళా కాంగ్రెస్ నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ అధికారంలోకి రావడానికి ఎంతగానో కష్టపడిన తమను కాదని వేరే పార్టీలో పదవులు అనుభవించిన వారికి మహిళా కమిషన్ లాంటి కీలక పదవి ఇవ్వడం సరైన పద్ధతి కాదని పార్టీ పెద్దల దగ్గర గోడును వెళ్లబోసుకున్నారట.వాస్తవానికి ఇప్పటివరకు పనిచేసిన మహిళా కమిషన్ ఛైర్మన్‌కేవలంఏడాదిన్నరమాత్రమేపదవిలో కొనసాగారు. కమిషన్ పదవీకాలం ఐదేళ్లు కాగా.. మూడున్నరేళ్లు ఈ పదవిలో ఉన్న సునితా లక్ష్మారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో రాజీనామా చేశారు. దీంతో మిగిలిన ఏడాదిన్నర కోసమే నేరెళ్ల శారదకు అవకాశం ఇచ్చారు. ఏడాదిన్నర కాలం కూడా సమర్థవంతంగా పనిచేశారన్న పేరు కూడా తెచ్చుకున్నారు. దీంతో ఆమెకు ఎక్స్‌టెన్షన్ ఖాయమనే అంతా భావించారు. అయితే కేకే కూతురు, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మీ పదవీకాలం ఈ నెల ముగుస్తుండడంతో ఆమెకు మహిళా కమిషన్ ఛైర్మన్ పోస్టు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసమే ఇప్పటివరకు శారదకు ఎక్స్ టెన్షన్ ఇవ్వకుండా..కొత్త వారితో భర్తీ చేయకుండా ఆపారన్న టాక్ నడుస్తోంది. దీనిపై ఒరిజినల్ కాంగ్రెస్ మహిళా నేతల్లో అసహనం వ్యక్తం అవుతోంది.డిమాండ్లు, అభ్యంతరాలు, ఆశావహులు ఈక్వేషన్స్ ఎలా ఉన్నా..మార్చి ఫస్ట్ వీక్‌లో కాంగ్రెస్ పార్టీలో పదవుల పందేరం మాత్రం పక్కా అన్న టాక్ వినిపిస్తోంది. అయితే పదవుల పందేరంలో ఒరిజినల్ కాంగ్రెస్ వర్సెస్ కొత్త కాంగ్రెస్ నేతల్లో ఎవరి ఆశలు నెరవెరుతాయో చూడాలి మరి.

# జనారణ్యంలోకి జంతువులు

**దశ, అదిలాబాద్:** దట్టమైన వృక్షాలు. ఆకాశాన్ని తాకే విధంగా కొండలు.. గలగల పారే సెలయేర్లు.. అందులో రకరకాల జంతువులు.. ఫలితంగా జీవావరణం అద్భుతంగా ఉండేది. ప్రకృతి సమతుల్యం గొప్పగా అనిపించేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఎందుకంటే అభివృద్ధి వల్ల చెట్లు నేల కూలిపోయాయి. కొండలు కరిగిపోయాయి. సెలయేర్లు కాలగర్భంలో కలిసిపోయాయి.అడవిని నమ్ముకున్న జంతువులు ఒక్కొక్కటిగా చనిపోతున్నాయి. ఉన్న జంతువులు జనావాసాలాలో పడి కన్నుమూస్తున్నాయి. పెద్దపులి నుంచి మొదలు పెడితే జింకల వరకు ఇదే పరిస్థితి. కొన్ని సందర్భాలలో ఉన్న అడవుల్లో కూడా పులులకు ఆహారం దొరకడం లేదు. ఆహార అన్వేషణలో భాగంగా



పులులు ఉన్న ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి వస్తున్నాయి. ఆ సమయంలో ఆహారం లభించక.. ఆవాసం దొరకక నరకం చూస్తున్నాయి.తెలంగాణ రాష్ట్రంలో యాదాద్రి, జనగామ జిల్లాలలో మహారాష్ట్రలోని పాండవ ఖరా టైగర్ రిజర్వ్ నుంచి ఒక పులి వచ్చింది. ఈ పులి ముందుగా ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ ప్రాంతంలోకి ప్రవేశించింది. ఆ తర్వాత 250 కిలోమీటర్ల వరకు ప్రయాణించి యాదాద్రి, జనగామ జిల్లాలలో ప్రవేశించింది. యాదాద్రి జిల్లాలోని కొలనుపాక ప్రాంతం నుంచి లింగాల గణపురం మండలం కుందారం గ్రామం శివారులోకి వచ్చింది. అక్కడ ఓ రైతుకు సంబంధించిన లేక దూడను చంపి తినేసింది. ఈ విషయం అటవీశాఖ అధికారులకు తెలియడంతో వారు పులి పాదముద్రలను పరిశీలించారు. అంతేకాదు ప్రజలకు సూచనలు చేశారు. రాత్రిపూట ఒంటరిగా వెళ్లకూడదని హెచ్చరించారు.వాస్తవానికి ఈ ప్రాంతాల్లో పులి కనిపించక దాదాపు 50 సంవత్సరాలు దాటిపోయింది. గతంలో ఈ ప్రాంతాలలో అడవులు విస్తారంగా ఉండేవి. కానీ, క్రమక్రమంగా అడవులు తగ్గిపోవడంతో పులులు కనుమరుగైపోయాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పులులకు కూడా సరైన ఆవాసం, ఆహారం లభించకపోవడంతో జనావాసాల్లోకి వస్తున్నాయి. చివరికి ప్రాణాలు కోల్పోతున్నాయి. మహారాష్ట్ర నుంచి వచ్చిన పులి పరిస్థితి కూడా ఇలానే ఉంది. అది ఆహార అన్వేషణ కోసం.. మనుగడ కోసం ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఉపయోగం ఉండడం లేదు.

## తెలుగు రాష్ట్రాల రైతుల నెత్తిపై

# అప్పుల మోత

### టాప్‌లో ఏపీ, 5వ స్థానంలో తెలంగాణ

**దశ న్యూఢిల్లీ**

దేశానికి అన్నం పెట్టేది రైతు. దేశ అభివృద్ధికి తోడుగా ఉండేది వ్యవసాయ రంగం. ఇక మన భారతదేశంలో 60 శాతానికి పైగా వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కానీ రైతులు మాత్రం మన దేశంలో నానాటికీ అప్పుల ఊబిలో కూరుకుపోతునే ఉన్నారు. రైతును రాజుగా చేయాలని అటు కేంద్ర ప్రభుత్వం.. ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు.. అన్నదాతలకు ఎన్నో రాయితీలు, పథకాలు, ఆర్థిక సహాయాలు అందిస్తున్నప్పటికీ.. రైతులు మాత్రం లాభాల్లోకి రాలేకపోతున్నారు. లాభాల సంగతి పక్కన పెడితే.. వారి నెత్తిపై రోజురోజుకూ అప్పుల కుప్ప కొండలా పేరుకుపోతోంది.

ఈ నేపథ్యంలోనే దేశంలో రాష్ట్రాల వారిగా రైతులపై ఉన్న అప్పులకు సంబంధించి.. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్.. మంగళవారం లోక్‌సభ వేదికగా కీలక ప్రకటన చేశారు. రైతులు అత్యధిక అప్పులు తీసుకున్న రాష్ట్రాల జాబితాను కేంద్రమంత్రి వెల్లడించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా.. తెలంగాణ ఐదో స్థానంలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ లెక్కన దేశంలోనే అధిక అప్పుల భారం ఆంధ్రప్రదేశ్ అన్నదాతలపైనే ఉన్నట్లు స్పష్టం చేశారు.

2018 జూలై నుంచి 2019 జూన్ మధ్య ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న రైతుల సగటు అప్పు విలువ రూ.2,35,554 ఉన్నట్లు కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. అదే సమయంలో తెలంగాణ రైతుల సగటు అప్పు రూ.1,52,113 ఉన్నట్లు తేల్చి చెప్పారు. అదే సమయంలో దేశవ్యాప్తంగా రైతుల సగటు అప్పుల భారం రూ.74,121 ఉన్నట్లు కేంద్రమంత్రి లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు.

ఇదిలా ఉంటే.. దేశఆర్థిక వ్యవస్థకు మూలం గ్రామీణ, వ్యవసాయ రంగాలే. 1991 తర్వాత చేపడుతున్న ఆర్థిక సంస్కరణలు ఇండియాను ప్రపంచంలోనే ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మలిచినా, వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతుండటంతో దేశంలో ఉపాధి అవకాశాలు మెరుగు పడటం లేదు. మరోవైపు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. రుణమాఫీ, MSP వంటి ఉపశమన చర్యలు సమస్య మూల కారణాలను పరిష్కరించలేకపోతున్నాయి.

## కొండాపూర్‌లో రూ. 700 కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా

**దశ, హైదరాబాద్:** హైడ్రా హైదరాబాద్‌లో కబ్జాదారుల ఆట కట్టిస్తోంది. ఈ క్రమంలో కొండాపూర్ పరిధిలోని రూ.700 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. నగరంలోని కొండాపూర్ ప్రాంతంలో అక్రమ కబ్జాకు గురైన భారీ విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. రూ.700 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను హైడ్రా అధికారులు విజయవంతంగా స్వాధీనం చేసుకున్నారు. శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం నుంచి మదీనగూడకు వెళ్లే మార్గంలో హైడ్రా కీలక ఆపరేషన్ నిర్వహించింది. సుమారు ఏడు వందల కోట్ల విలువైన ఈ భూమిని కబ్జాదారుల నుంచి విడిపించి హైడ్రా స్వాధీనం చేసుకుని ప్రభుత్వానికి అప్పగించింది. స్థానిక జంగమోనికుంటకు సంబంధించిన 4 ఎకరాల భూమిని కొందరు కబ్జాదారులు ఆక్రమించారు. ఆ నీటి కుంటను మట్టితో పూడ్చి ప్లాట్లుగా మార్చి విక్రయించడానికి సన్నద్ధమయ్యారు. ఈ అక్రమాలపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందడంతో, వారు కబ్జాదారులపై కేసులు నమోదు చేశారు. ప్రజల ఫిర్యాదులతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ఆ విలువైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని కుంట చుట్టూ ఫెన్సింగ్ వేసి రక్షణ కల్పించారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com